

కరీంనగర్ మంకమ్మతోటలోని ప్రభుత్వ బాలికల కళాశాలలో ఓటు హక్కు వినియోగించుకుంటున్న పట్టభద్రులు

## దక్షిణాదిలో ఎంపీ సీట్లు తగ్గితే ఊరుకోం

దక్షిణాది రాష్ట్రాల్లో జనాభా లెక్కల ప్రకారం పార్లమెంట్ సీట్లు తగ్గిస్తే ఎవరూ ఊరుకోరు. అయితే, కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యల ప్రకారం చూస్తే సీట్లు తగ్గించే ఆలోచనలో కేంద్ర ప్రభుత్వం లేదని మేం అనుకుంటున్నాం. ప్రస్తుత ఎన్నికల్లో ఎవరు గెలిచినా పట్టభద్రుల సమస్యలకు పరిమితం కాకుండా, విద్యా విధానం, నైపుణ్యత పెంచే విషయంపై మాట్లాడాల్సిన అవసరం ఉన్నది. రాష్ట్రంలో నూతన ఒరవడిలో విద్యా విధానం కొనసాగించాల్సిన ఆవశ్యకత ఉన్నది.

**- కరీంనగర్ వాణీనికేతన్ కళాశాలలో ఓటు వేసిన అనంతరం మీడియాతో మాజీ ఎంపీ వినోద్‌కుమార్**





కరీంనగర్: ముకరంపురలోని ప్రభుత్వ పాఠశాలలో ఓటేస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి



కరీంనగర్‌లోని మహిళా డిగ్రీ కళాశాలలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు బారులు తీరిన ఉపాధ్యాయ ఓటర్లు







# మండలి పోరు ప్రశాంతం

## ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికలు.. వచ్చే నెల 3న ఫలితాలు





కరీంనగర్‌లోని ఓటేసిన ఓటర్లు

### పట్టభద్రుల సమస్యలపై పోరాడాలి

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎవరు గెలిచినా పట్టభద్రుల సమస్యలపై ప్రభుత్వంతో పోరాడి వాటిని పరిష్కరించేందుకు కృషి చేయాలి. నేను మొదటిసారిగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్నా. ఎవరు గెలిచినా రాజకీయ పార్టీల పరంగా కాకుండా ఓట్లు వేసిన పట్టభద్రుల సమస్యలపై మాట్లాడాలి. శాసనమండలిలో ప్రభుత్వానికి, పట్టభద్రుల వారధిగా పనిచేయాలి.

**- కరీంనగర్ వాణీనికేతన్ కళాశాలలో ఓటు వేసిన అనంతరం మీడియాతో ఎమ్మెల్యే గంగుల కమలాకర్**

### పట్టభద్రుల నియోజకవర్గం (ఉమ్మడి కరీంనగర్ జిల్లా)

| జిల్లా | మొత్తం ఓటర్లు | పోలైన ఓట్లు | శాతం |
|---|---|---|---|
| కరీంనగర్ | 71,545 | 46,247 | 64.64 |
| జగిత్యాల | 35,281 | 24,862 | 70.47 |
| పెద్దపల్లి | 31,098 | 21.259 | 68.50 |
| సిరిసిల్ల | 22,397 | 15,344 | 68.51 |
| మొత్తం | 1,60,321 | 1,07,712 | 67.18 |

### ఉపాధ్యాయ నియోజకవర్గం (ఉమ్మడి కరీంనగర్ జిల్లా)

| జిల్లా | మొత్తం ఓటర్లు | పోలైన ఓట్లు | శాతం |
|---|---|---|---|
| కరీంనగర్ | 4,305 | 3,871 | 89.92 |
| జగిత్యాల | 1,769 | 1,635 | 92.43 |
| పెద్దపల్లి | 1,111 | 1,049 | 94.42 |
| సిరిసిల్ల | 950 | 899 | 94.63 |
| మొత్తం | 8,135 | 7,454 | 91.62 |

- ‘పట్టభద్రుల’కు 70.42 శాతం.. ‘ఉపాధ్యాయుల’కు 91.90 శాతం పోలింగ్
- ఓటెత్తిన పంతుళ్లు
- ఓటు హక్కు వినియోగించుకున్న అభ్యర్థులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు
- కరీంనగర్ చేరుకున్న నాలుగు ఉమ్మడి జిల్లాల బ్యాలెట్ బాక్సులు
- అంబేద్కర్ ఇండోర్ స్టేడియంలో భద్రం
- వచ్చే సోమవారం రిజల్ట్స్
- అప్పటిదాకా ఉత్కంఠే

**కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో 67.18 శాతం ఓట్లు వేసిన టీచర్లు.. 91.62 శాతం మంది గ్రాడ్యుయేట్లు**

**మండలి పోరు ముగిసింది. మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ ఉమ్మడి జిల్లాల పరిధిలోని పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు పోలింగ్ ప్రశాంతంగా సాగింది. గురువారం ఉదయం 8నుంచి సాయంత్రం 4గంటల వరకు ఓటింగ్ సాగగా, కరీంనగర్ ఉమ్మడి జిల్లా పరిధిలో ‘పట్టభద్రుల’కు 70.42 శాతం, ‘ఉపాధ్యాయుల’కు 91.90 శాతం నమోదైంది. పోలింగ్ అనంతరం నాలుగు ఉమ్మడి జిల్లాల్లోని బ్యాలెట్ బాక్సులను కరీంనగర్ అంబేద్కర్ స్టేడియానికి తరలించి, ఇండోర్‌స్టేడియంలో భద్రపరిచారు. వచ్చే సోమవారం ఫలితాలను ప్రకటించనుండగా, అందుకు అన్ని ఏర్పాట్లూ చేస్తున్నారు.**



కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్ రూంకు తీసుకెళ్తున్న సిబ్బంది

### జిల్లాల వారీగా పట్టభద్రుల స్థానం పోలింగ్ వివరాలు

| జిల్లా | మొత్తం ఓటర్లు | పోలైన ఓట్లు | శాతం |
|---|---|---|---|
| ఆసిఫాబాద్ | 6137 | 4546 | 74.08 |
| మంచిర్యాల | 30921 | 20811 | 67.30 |
| ఆదిలాబాద్ | 14935 | 10375 | 69.47 |
| నిర్మల్ | 17141 | 12088 | 70.52 |
| నిజామాబాద్ | 31574 | 24388 | 77.24 |
| కామారెడ్డి | 16410 | 12820 | 78.12 |
| జగిత్యాల | 35281 | 24862 | 70.47 |
| పెద్దపల్లి | 31037 | 21259 | 68.50 |
| కరీంనగర్ | 71545 | 46247 | 64.64 |
| సిరిసిల్ల | 22397 | 15394 | 68.73 |
| సంగారెడ్డి | 25652 | 18774 | 73.19 |
| మెదక్ | 12472 | 9387 | 75.26 |
| సిద్దిపేట | 32589 | 23736 | 72.83 |
| హనుమకొండ | 4585 | 3445 | 75.14 |
| భూపాలపల్లి | 2483 | 1974 | 79.50 |
| మొత్తం | 355159 | 250106 | 70.42 |

కరీంనగర్, ఫిబ్రవరి 27 (నమస్తే తెలంగాణ) : పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు గురువారం ఎన్నికలు నిర్వహించారు. గ్రాడ్యుయేట్ స్థానానికి 56 మంది, టీచర్ స్థానానికి 15 మంది అభ్యర్థులు బరిలో నిలువగా, 15 జిల్లాల్లో 499 పట్టభద్రుల, 274 ఉపాధ్యాయుల, 99 కామన్ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఓటింగ్ ఉదయం మందకొడిగా ప్రారంభమైనా.. పది గంటల నుంచి ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు కదిలారు. మధ్యాహ్నం వరకు పుంజుకోగా, 2గంటల తర్వాత పెద్దసంఖ్యలో బారులు తీరి కనిపించారు. సాధారణ ఎన్నికలను తలపించేలా క్యూలో నిల్చొని ఉత్సాహంగా ఓటు వేశారు. సాయంత్రం 4 గంటల వరకే పోలింగ్ ముగియాల్సి ఉండగా, ఆ సమయంలోగా కేంద్రాలకు చేరుకున్న వారికి ఓటు వేసే అవకాశం కల్పించారు. అక్కడక్కడ రాత్రి ఏడు గంటల వరకు కూడా ఓపికతో ఉండి ఓటు వేశారు. అభ్యర్థులతోపాటు అధికారులు, ప్రజాప్రతినిధులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తంగా పట్టభద్రుల నియోజకవర్గంలో మొత్తం 3,55,159 మంది ఓటర్లకు 2,50,106 మంది (70.42 శాతం), ఉపాధ్యాయ నియోజకవర్గంలో 27,088 మంది ఓటర్లకు 24,895 మంది (91.90 శాతం) తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో 1,60,321 మంది పట్టభద్రులకు 1,07,712 (67.18 శాతం) మంది.. 8,135 మంది ఉపాధ్యాయ ఓటర్లకు 7,454 (91.62 శాతం) మంది ఓటు వేశారు. అయితే ఈసారి పట్టభద్రులతో పోలిస్తే ఉపాధ్యాయులు ఓటెత్తారు. ప్రభుత్వం క్యాజువల్ సెలవులు మంజూరు చేయడంతో ఎక్కువశాతం ఓటు వేశారు. అయితే అక్కడక్కడ అరకొర ఏర్పాట్లు చేయడంపై ఓటర్లు అసహనం వ్యక్తం చేశారు. ఓటు వేసేందుకు గంటల తరబడి లైన్లలో ఉండాల్సి వచ్చిందని వాపోయారు. క్యూలో నిల్చున్న ఓటర్లకు నీడనిచ్చేలా టెంట్లు ఏర్పాటు చేయలేదని, తాగునీటి సదుపాయం కల్పించలేదని మండిపడ్డారు. పోలింగ్ ముగిసిన అనంతరం నాలుగు ఉమ్మడి జిల్లాల నుంచి బ్యాలెట్ బాక్సులను కరీంనగర్ జిల్లాకేంద్రానికి తరలించారు. రిటర్నింగ్ ఆఫీసర్ పమేలా సత్పతి పర్యవేక్షణలో బ్యాలెట్ బాక్స్‌లను అంబేద్కర్ స్టేడియంలోని ఇండోర్ స్టేడియంలో భద్రపరిచారు. ఈ స్ట్రాంగ్ రూంలకు మూడంచెల పద్ధతిలో బందోబస్తు ఏర్పాటు చేశారు. వచ్చే నెల 3న అంటే వచ్చే సోమవారం కౌంటింగ్ చేసి, ఫలితాలను ప్రకటించనున్నారు. కాగా రిటర్నింగ్ ఆఫీసర్ కరీంనగర్‌లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటింగ్ సరళిని పరిశీలించారు. పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి కూడా జిల్లా కేంద్రంలోని పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

### జిల్లాల వారీగా ఉపాధ్యాయ స్థానం పోలింగ్ వివరాలు

| జిల్లా | మొత్తం ఓటర్లు | పోలైన ఓట్లు | శాతం |
|---|---|---|---|
| ఆసిఫాబాద్ | 470 | 424 | 90.21 |
| మంచిర్యాల | 1664 | 1527 | 91.77 |
| ఆదిలాబాద్ | 1593 | 1478 | 92.78 |
| నిర్మల్ | 1966 | 1614 | 82.10 |
| నిజామాబాద్ | 3751 | 3468 | 92.46 |
| కామారెడ్డి | 2011 | 1883 | 93.64 |
| జగిత్యాల | 1769 | 1635 | 92.43 |
| పెద్దపల్లి | 1111 | 1049 | 94.42 |
| కరీంనగర్ | 4305 | 3871 | 89.92 |
| సిరిసిల్ల | 950 | 899 | 94.63 |
| సంగారెడ్డి | 2690 | 2490 | 92.57 |
| మెదక్ | 1347 | 1280 | 95.03 |
| సిద్దిపేట | 3212 | 3046 | 94.83 |
| హనుమకొండ | 166 | 154 | 92.77 |
| భూపాలపల్లి | 83 | 77 | 92.77 |
| మొత్తం | 27088 | 24895 | 91.90 |



మారుతినగర్: మెట్‌పల్లిలో ఓటేసిన అనంతరం సిరా గుర్తు చూపుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల



పెద్దపల్లి: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓటేసిన మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి



కరీంనగర్: మంకమ్మతోటలోని ప్రభుత్వ బాలికల కళాశాలలో ఓటేసిన కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి



సెయింట్ జాన్స్ స్కూల్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న పట్టభద్రుల అభ్యర్థి శేఖర్‌రావు



సిరిసిల్ల జిల్లా బోయినపల్లిలో ఓటేసిన పట్టభద్రుల అభ్యర్థి పులి ప్రసన్న హరికృష్ణ



మానకొండూర్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు



ఎల్లారెడ్డిపేట: ఓటు హక్కు వినియోగించుకున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య



కరీంనగర్ : మంకమ్మతోటలోని ప్రభుత్వ బాలికల కళాశాలలో ఓటు హక్కు వినియోగించుకున్న వృద్ధ ఓటర్లు



కరీంనగర్‌లో ఓటుహక్కు వినియోగించుకున్న దివ్యాంగుడు

## బొట్టు బొట్టు పట్టుకుని .. గొంతు తడుపుకొని!



గంభీరావుపేట బస్టాండ్ వద్ద పబ్లిక్ ట్యాప్ నుంచి వస్తున్న చుక్క చుక్క నీటితో దాహం తీర్చుకునేందుకు తండ్లాడుతున్న మేక

గంభీరావుపేట, ఫిబ్రవరి 27 : చెరువులు, కుంటల్లో నీళ్లు లేకపోవడంతో మూగజీవాలు తాగునీటి కోసం అల్లాడుతున్నాయి. ఇందుకు గంభీరావుపేట మండల కేంద్రంలోని గాంధీ విగ్రహం వద్ద బస్టాండ్ పబ్లిక్ ట్యాప్ వద్ద ఓ మేక పడ్డ నరకయాతనే నిదర్శనంగా కనిపిస్తున్నది. నల్లా నుంచి బయటకు వస్తున్న నీటి చుక్కలతో మేక తన దాహం తీర్చుకోడానికి ఇలా తండ్లాడింది. నేరుగా పైపునకు తన నోటిని అదిమి పెట్టి బొట్టు బొట్టును ఒడిసి పడుతూ గొంతు తడుపుకొన్నది.

## ఆర్‌వో నీళ్లు ఆగిపాయె!




వేసవి రాకముందే బంద్ అయిన అదే వాటర్ ప్లాంట్

కోల్‌సిటీ, ఫిబ్రవరి 27 : ఇక్కడ కనిపిస్తున్న రెండు చిత్రాల్లో మొదటిది.. గోదావరిఖని జవహర్‌నగర్ స్టేడియం వద్ద బీఆర్‌ఎస్ హయాంలో అప్పటి ఎమ్మెల్యే కోరుకంటి చందర్ చొరవతో ఇంటింటికీ మినరల్ వాటర్ అందించాలనే ఉద్దేశంతో సింగరేణి యాజమాన్యంతో మాట్లాడి ఏర్పాటు చేసిన ఆర్‌వో వాటర్ ప్లాంట్. దీంతో చుట్టు పక్కల గల 11, 12, 13, 32, 33, 44 డివిజన్ల ప్రజలు, కార్మిక కుటుంబాలకు స్వచ్ఛమైన తాగునీరు అందింది. మండు వేసవిలోనూ ఇబ్బంది ఉండేది కాదు. మరిప్పుడు పరిస్థితి మారింది. అందుకు ఈ రెండో చిత్రమే అద్దం పడుతున్నది. వేసవి రాకముందే అంటే నెల క్రితమే ఈ ప్లాంట్‌ను మూసేశారు. నీటి సరఫరా బంద్ చేశారు. దీంతో తాగునీటి కోసం గోసపడాల్సిన దుస్థితి దాపురించింది.




